ప్రజా సమస్యలపై చర్చించేనా!

నేడు బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్, జనవరి 28 : బల్దియా సమావేశాలు ప్రజా సమస్యలు గాలికి వదిలి.. వ్యక్తిగత ఏజెండాలతో అర్థరహితంగా సాగుతున్నాయి. గ్రేటర్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలు, ఎదురుదాడులతో సమయం వృథా అవుతోందనే విమర్శలు ఉన్నాయి. బుధవారం జరిగే ఈ సమావేశంలో ప్రజా సమస్యలు చర్చకు వచ్చేనా! అనే అభిప్రాయాలు నగరవాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ కార్పొరేషన్ ముఖ్యంగా కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అనేక మంది చిన్నారులు కుక్కకాటుకు గురైన ఘటనలు ఉన్నాయి. లీకేజీలతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రేటర్‌లో ఎప్పుడు ఏ ప్రాంతంలో తాగునీటి సరఫరా నిలిచిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. రాబోయే వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి రాకుండా పక్కా ప్రణాళికలు చేయాల్సి ఉంది. నగరంలో అంతర్గత రహదారులతో అధ్వానంగా మారాయి. స్మార్ట్‌సిటీ

నిధులతో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మార్చి 31 నాటికి పూర్తి చేయాల్సిన పరిస్థితి ఉంది. నగరవాసులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని సగటు నగరవాసి కోరుకుంటున్నారు.

వ్యక్తిగత ఏజెండాలే ఎక్కువ

ప్రజా సమస్యల కంటే కార్పొరేటర్లు సొంత ఎజెండాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే వాదనలు ఉన్నాయి. డివిజన్ సమస్యల కంటే అనవసర అంశాలను ఎత్తుకుంటున్నారు. అధికార పార్టీ కార్పొరేటర్లు విపక్ష కార్పొరేటర్లకు అవకాశం ఇవ్వకుండా అడ్డుపడుతూ సమస్యలు వినిపించే గొంతు నొక్కుతున్నారనే అభిప్రాయాలు గత సమావేశాలు చూసే అర్థం అవుతోంది. ఇప్పటికైనా వ్యక్తిగత ఎజెండాలు కాకుండా ప్రజా ఎజెండాలతో కార్పొరేటర్ బల్దియా కౌన్సిల్ హాల్‌లోకి అడుగుపెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

చెల్లింపులు, కొనుగోళ్లు

బల్దియా సర్వసభ్య సమావేశంలో ఎక్కువగా పెండింగ్ బిల్లుల చెల్లింపులు ఎక్కువగా ఉన్నాయి. 16 ప్రధాన ఏజెండా అంశాలు ఉండగా, మరో 6 సంప్లిమెంటరీ ఎజెండా అంశాలు ఉన్నాయి. ప్రధాన ఎజెండాలో అన్నపూర్ణ పథకానికిగాను నాలుగు నెలల పెండింగ్ బిల్లుల చెల్లింపులు, అర్బన్ మలేరియా కార్మికుల ఆరు నెలల వేతనం, ఓనర్ కం డ్రైవర్ స్వచ్ఛ ఆటోలకు చెందిన కార్మికుల మూడు నెలల వేతనాలు చెల్లించేందుకు కౌన్సిల్ సమావేశంలో పరిపాలన అనుమతులు ఇచ్చేందుకు ఎజెండాలో పెట్టారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి సమగ్ర డీపీఆర్ ప్రాథమిక అంచనాలు రూ.4170కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేయనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో స్వచ్ఛ ఆటోల కొనుగోళ్లకు, కాశిబుగ్గ, కాజీపేట సర్కిళ్ల పరిధిలో బయో మైనింగ్ ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలపనుంది. పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు ఆమోదముద్ర వేయనున్నారు. సంప్లిమెంటరీ ఎజెండాలో నిట్ నుంచి అదాలత్ వరకు ఉన్న ప్రధాన రహదారికి రెడ్‌క్రాస్ మార్గ్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపే అంశంతోపాటు 11వ డివిజన్‌లోని నూతనంగా ఏర్పడిన కాలనీకి భద్రకాళీ మున్నూరుకాపు కాలనీగా నామకరణం ప్రతిపాదనలు చేసే అంశాలను చేర్చారు. వర్క్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 452 మంది పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న రూ.13వేల వేతనంపై 30శాతం పెంచుతూ రూ.16,600 చెల్లించేందుకు ప్రభుత్వ అనుమతి కోసం కౌన్సిల్ ఏజెండాలో చేర్చారు. కార్పొరేషన్‌కు చెందిన భారీ వాహనాలు నడుతున్న ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, డిప్యూటేషన్‌పై డ్రైవర్లుగా పనిచేస్తున్న వారి వేతనాలను రూ.16,600 నుంచి రూ.20,500 పెంచుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

చిట్టీ డబ్బులు అడిగినందుకు..

- రాత్రంతా ఆఫీస్‌లో నిర్బంధం
- కనకదుర్గ చిట్‌ఫండ్ యాజమాన్యం దౌర్జన్యం

నిర్బంధంలో బాధితుడు

సుబేదారి, జనవరి 28 : కనుకదుర్గ చిట్‌ఫండ్‌లో చిట్టీ వేసిన డిపాజిట్‌దారుడిపై ఆ చిట్‌ఫండ్ సంస్థ యాజమాన్యం దౌర్జన్యంగా వ్యవహరించింది. ఆఫీస్‌లో రాత్రంతా నిర్బంధించి దాడికి పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్డులోని కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కానిపర్తికి చెందిన బాధిత లారీడ్రైవర్ ధరుముల ప్రతాప్ 2000లో కనకదుర్గ చిట్ ఫండ్‌లో రూ.5లక్షల చిట్టీ వేశాడు. చిట్టీ గడువు పూర్తవడంతో డిపాజిట్ డబ్బుల కోసం రెండేళ్లుగా హనుమకొండ గోపాల్‌పూర్‌లోని కనకదుర్గ చిట్‌ఫండ్ సంస్థ ప్రధాన కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. చిట్‌ఫండ్ సంస్థ చైర్మన్ తిరుపతిరెడ్డిని పలుమార్లు కలిసినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝాకు ఫిర్యాదు చేశాడు. ఆతర్వాత తనకు పోలీసు అధికారులందరూ తెలుసని, ఎవరికి చెప్పుకున్నా ఏమీ కాదని చైర్మన్ బెదిరించాడు. డబ్బుల కోసం సోమవారం అన్న, తమ్ముడితో కలిసి గోపాల్‌పూర్ ఆఫీస్ వెళ్లాడు. అక్కడున్న సిబ్బంది తన అన్న, తమ్ముడిని పంపించేసి, తనను ఆఫీస్ రూమ్‌లో బంధించి, కొట్టి రాత్రంతా ఆఫీస్‌లోనే నిర్బంధించారని బాధితుడు ఆవేదన చెందాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలయ్యింది.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో వేగం పెంచాలి

సీఎంను కోరిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు


సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు

హనుమకొండ, జనవరి 28: వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాంచంద్రూనాయక్, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినీరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సీఎంను కలిశారు. ఉమ్మడి జిల్లా తోపాటు నగర అభివృద్ధిపై చర్చించారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. రాంపూర్, మడికొండ మధ్య డంపింగ్ యార్డ్ ద్వారా గాలి, తాగునీరు కలుషితమవుతోందని, విపరీతమైన పొగ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాలని కోరారు. గ్రేటర్ వరంగల్‌కు మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల డీపీఆర్ తయారుచేసి త్వరగా పనులు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్ ఎస్టిమేషన్స్ త్వరగా చేయించి పనులు ప్రారంభించాలని కోరారు. ఆయా అంశాలపై సీఎం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు ఇచ్చారు. జనవరి 31న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. స్టేషన్ ఘన్‌పూర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎంకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహాసేన నాయకులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 28: ఎస్సీ వర్గీకరణకు అన్నివర్గాలు మద్దతు ప్రకటించినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహాసేన జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహాసేన తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురా లు దామెర కరుణ ఆధ్వర్యంలో వర్గీకరణకు మద్దతు 'లక్ష డబ్బులు వేల గొంతులు' విజయవంతం కోసం మంగళవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే మరింత ఉద్యమిస్తామన్నారు. సుమారు వంద మంది మహిళలతో డప్పుకళాకారులతో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వర్గీకరణకు మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దసరాపు సారయ్య, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు సమ్మయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వసుకుల ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు డీఎస్ ప్రభాకర్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గుర్రం శ్రావణి ఉపాధ్యక్షురాలు ఎలిషా పాల్గొన్నారు.

కాజీపేటలో బస్టాండ్ స్థల పరిశీలన

- రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ ఆవరణ ఎంపిక
- పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, మేయర్

రైల్వే అధికారులతో చర్చిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్

కాజీపేట, జనవరి 28: కాజీపేట రైల్వేస్టేషన్ ఆవరణలో బస్టాండ్ నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ (ఏడీఆర్ఎం) అడిషనల్ డివిజన్ రైల్వే మేనేజర్ ఎం గోపాల్, సీనియర్ డీఈఎన్ ప్రంజల్ కేశర్వాణి బృందంతో ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య రైల్వేస్టేషన్ పరిసరాల్లో మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కాజీపేట రైల్వే ఏరియాలోని మూడు వేర్వేరు ప్రాంతాలను రైల్వే అధికారులు, జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం పరిశీలించి, బస్టాండ్‌కు అన్ని విధాలా అనువుగా ఉన్న కాజీపేట రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ ఆవరణ ఎంపిక చేసి, ఎకరం స్థలం కేటాయించాలని రైల్వే అధికారులను కోరారు. అంతకుముందు వారు రైల్వే స్థలాలను మ్యాప్‌లో పరిశీలించారు. ఎంపీ, మేయర్, ఎమ్మెల్యే, కలెక్టర్ బస్టాండ్ నిర్మాణానికి కోరిన స్థల నివేదికను రైల్వే ఏడీఆర్ఎం బృందం రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్టాండ్ నిర్మాణానికి అంగీకారం వచ్చేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఎకరం స్థలంలో 8 నుంచి 10 బస్సులు నిలిచేలా బస్టాండ్ నిర్మించనున్నట్లు తెలిపారు. కాజీపేటలో ప్రభుత్వ దవాఖాన, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌డీఓ రమేశ్‌రాథోడ్, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, రెవెన్యూ అధికారులు, రైల్వేఅధికాలు, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి పాల్గొన్నారు.

సివిల్ పంచాయతీలకు దూరంగా ఉండాలి

సుబేదారి, జనవరి 28: పోలీస్ అధికారులు సివిల్ పంచాతీయితీలకు దూరంగా ఉండాలని, తప్పుడు కేసులు నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా హెచ్చరించారు. మంగళవారం హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్‌లో సీపీ పోలీస్ అధికారులతో నేరసమీక్ష నిర్వహించారు. పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్, దర్యాప్తు కేసులు, మహిళపై నేరాలు, పోక్సో, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేయాలని అన్నారు. డీసీపీలు షేక్‌సలీమా, రవీందర్, ఏఎస్పీ చేతన్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్

హనుమకొండ, జనవరి 28: జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి వరంగల్ ఎంపీ కడియం కావ్యను మంగళవారం హనుమకొండలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ మొట్టమొదటి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, వరంగల్ ఎంపీ కడియం కావ్య మంగళవారం హనుమకొండ కనుకదుర్గకాలనీలోని తన నివాసంలో ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రూ.2.55లక్షల విలువైన చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

'సోలార్ ప్లాంట్ మాకొద్దు'

కమలాపూర్, జనవరి 28: మండలంలోని గూడూరు గ్రామస్తులు సోలార్ ప్లాంట్ తమకు వద్దని ఎంపీడీవో బాబు, నాయబ్ తహసీల్దార్ శోభారాణికి మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామశివారులోని సర్వే నంబర్ 143లో అధికారులు సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారని, దీన్ని వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు. గ్రామంలో ప్రభుత్వ భూమి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ పాక కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పాక లక్ష్మీ రవీందర్, సాంబయ్య, రాజ్‌కుమార్, కుమ్మరి బాబు, శేఖర్, అశోక్, అఖిల్, శివ, రామకృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

గుండెపోటుతో ఒకరి మృతి

వరంగల్‌చౌరస్తా, జనవరి 28: వైద్యం కోసం వచ్చిన ఒకరు అందరూ చూస్తుండగానే గుండెపోటుతో ప్రాణాలు వదిలిన ఘటన వరంగల్ ఎంజీఎం దవాఖాన ఔట్ పేషెంట్(ఓపీ) విభాగంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట ప్రాంతానికి చెందిన పిక్కల శ్రీనివాస్(45) అనారోగ్య సమస్యలతో ఎంజీఎంహెచ్ ఓపీ విభాగానికి వచ్చాడు. పేరు నమోదు చేసుకొని బయటకు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది బాధితుడిని అత్యవసర విభాగానికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే శ్రీనివాస్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి

హనుమకొండ చౌరస్తా, జనవరి 28: నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి కోడెపాక రాజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఒక్క శాతం మాత్రమే ఉన్నారని, ప్రధాన పార్టీలు సీట్లు కేటాయించడంలో తగిన ప్రాధాన్యం కల్పించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించే పార్టీకి మద్దతు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 2న అర్ట్స్ కాలేజీలో నిర్వహించే బీసీ సభకు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్ పిలుపునిచ్చారు. కస్తూరి సతీష్, సింగారపు రమేశ్, వల్లాజి రమేశ్, కొత్తగట్టు రవిస్టాలిన్, పలకంటి కన్నయ్య పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

హనుమకొండ చౌరస్తా, జనవరి 28: కేయూలో యూజీసీ పేస్కేల్ అమలు చేయకపోవడంపై కాంట్రాక్టు అధ్యాపకులు నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లో 20ఏళ్లకు పైగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తూ యూజీసీ పేస్కేల్స్ అమలు చేయాలని కోరుతూ, ఆ తర్వాతే కొత్త రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేయూలోని వివిధ కాలేజీల్లో (కేయూ క్యాంపస్, కేయూ కో ఎడ్యుకేషన్, ఉమెన్స్ ఇంజినీరింగ్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్) కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద క్యాంపస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసన తెలిపారు. సాదు రాజేశ్, సతీష్, మదాసి కనకయ్య, జూల సత్య, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, నాగయ్య, సూర్యనారాయణ, సంగీత్, ఆరూరి సూర్యం, ప్రణీత, వీణ, రాజేశ్వరి, సాహితీ, సిద్దార్థ, రంజిత్, సాంబశివరావు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు బోరు వేయించిన దాతలు

ఎల్కతుర్తి, జనవరి 28: మండలంలోని పెంచికల్‌పేటలోని శ్మశానవాటికకు నీటి ఎద్దడి ఉండడంతో దాతలు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన మామిడి గోపాల్ రెడ్డి సొంత డబ్బులతో బోరు వేయించాడు. గడ్డం ధర్మారెడ్డి, పెరుమాండ్ల సంతోష్ సైతం ముందుకొచ్చి తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం మోటర్, పైపులు బిగించారు.

బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నాయకుడిగా వీరస్వామి

హనుమకొండ, జనవరి 28: బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా హనుమకొండకు చెందిన కొంగ వీరస్వామిని నియమిస్తూ బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రిటైర్డ్ టీ చిరంజీవులు నియామక పత్రం అందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వీరస్వామితోపాటు వివిధ రంగాలకు చెందిన వారిని కో ఆర్డినేటర్లుగా నియమించారు. రాష్ట్ర నాయకులు చామకూర రాజు, అశోక్‌గౌడ్, అవ్వారు వేణుకుమార్, న్యాయవాది కొమరయ్యయాదవ్ పాల్గొన్నారు.

'వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన'

కాజీపేట, జనవరి 28: సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని అసెంబ్లీలో ప్రకటించి కాలయాపన చేస్తుండటం సరికాదని మాదిగ మహాజనుల వేదిక కన్వీనర్ గబ్బెట శ్రీనివాస్ మాదిగ అన్నారు. కాజీపేట పట్టణంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు – వేల గొంతులు' మహాసభ విజయవంతం చేయాలని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో ఆ వేదిక కన్వీనర్ గబ్బెట శ్రీనివాస్ మాదిగ, ఎమార్పీఎస్ నాయకులు బండారి సురేందర్ మాదిగ, మంద కుమార్ మాదిగ మాట్లాడారు. మాదిగ మహాజనుల వేదిక నాయకులు బొల్లె కుమార్, ఆరూరి సాంబయ్య, పసునూరి మనోహర్, సందేళ్ల విజయ్, ఇమ్మడి బాబు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

పరకాల, జనవరి 28: రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాదారం పీఏసీఎస్ చైర్మన్ ఓడీసీఎంఎస్ డైరెక్టర్ నల్లెల్ల లింగమూర్తి అన్నారు. డీసీసీ పరకాల బ్రాంచ్ పరిధిలో మంగళవారం పలువురు మహిళా రైతులకు రూ.10లక్షల చొప్పున రుణాలు అందించారు. ఆయన మాట్లాడారు. బ్యాంకు ఏజీఎం ప్రవంతి, మేనేజర్ శ్వేత, ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, పీఏసీఎస్ సీఈవో రాజేందర్, డైరెక్టర్లు అబ్బాడి కొంరారెడ్డి, ఎరుకల లింగమూర్తి పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు బీరువాల పంపిణీ

కమలాపూర్, జనవరి 28: మండలంలోని కానిపర్తిలో మహిళా సంఘాలకు స్నేహా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీరువాలు పంపిణీ చేసినట్లు ట్రస్టు ప్రధాన కార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి మంగళవారం తెలిపారు. కమలాపూర్‌కు చెందిన ఆడెపు జ్యోతి రాజు రూ.10వేల విలువైన బీరువాలు కొనుగోలు చేసి ఇవ్వడంతో మహిళా సంఘాలకు అందజేసినట్లు చెప్పారు. స్నేహా ఫౌండేషన్ నిర్వాహకులు మాదిరెడ్డి సంధ్య, కన్నెబోయిన అశోక్, జనగాని రామ్మోహన్, జనగాని వీరస్వామి, కోడిగూటి చేరాలు, బాల రాజు, శివకృష్ణ, ప్రభాకర్, రాజు ఉన్నారు.

పీహెచ్‌డీ స్కాలర్స్ సమస్యలను పరిష్కరించాలి

వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 28: కేయూలో పరిశోధన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఏటా అడ్మిషన్ రెన్యూవల్ ఫీజుకు విధించిన 20శాతం అపరాధ రుసుము తగ్గించాలని, పరిశోధన టైటిల్ రుసుము గతంలో రూ.200 ఉండగా రూ.2వేలకు పెంచగా యథాతథ స్థితికి తగ్గించాలన్నారు. పీహెచ్‌డీ సబ్మిషన్ కోసం పెంచిన ఫీజు రూ.12,500 రూ.5వేలకు తగ్గించాలని, పీహెచ్‌డీ కాలపరిమితి అనుమతి ఫీజు రూ.3వేలకు పెంచగా రూ.500కు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కత్తెరపల్లి దామోదర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, అర్బన్ జిల్లా కోఆర్డినేటర్ అరూరి రంజిత్ ఉన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, జనవరి 28: కాకతీయ యూనివర్సిటీ సెనెట్‌హాల్‌లో ఈనెల 30న జాతీయ సదస్సు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, అసోసియేషన్ అఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా సహకారంతో 'రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ఫార్మాస్యుటికల్ సైన్సెస్–2025' అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ తెలిపారు. సదస్సు పోస్టర్లను వైస్ చాన్స్‌లర్ కే.ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, డీన్ గాదె సమ్మయ్య, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు జే.కృష్ణవేణి, వై.నరసింహారెడ్డి, డాక్టర్ షాయెదా, స్వరూపరాణి, బి.నాగరాజు పాల్గొన్నారు.

కొత్తకొండ జాతర ఆదాయం రూ.1.10కోట్లు

భీమదేవరపల్లి, జనవరి 28: కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఆదాయం రూ.కోటీ 10లక్షల 36వేల 563 సమకూరినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. మంగళవారం స్వామివారి జాతర హుండీ ఆదాయం లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 36లక్షల 27వేల 222, 44 విదేశీ కరెన్సీ, 8 గ్రాముల మిశ్రమ బంగారం, కిలో 900 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు వివరించారు. ఈ ఏడాది టిక్కెట్ల ద్వారా రూ.30లక్షల 71వేల 341, టెండర్ల ద్వారా 36లక్షల 27వేల 222 ఆలయ హుండీతో మొత్తంగా రూ.1కోటి 10లక్షల 36వేల 563 వచ్చినట్లు వెల్లడించారు. గతేడాది కంటే రూ.15లక్షల97వేల58 అదనంగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేవాదాయ, ధర్మదాయశాఖ ఇన్స్పెక్టర్ అనిల్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

డీఆర్‌డీవోకు ఈజీఎస్ ఉద్యోగుల వినతి

హనుమకొండ, జనవరి 28: పెండింగ్ వేతనాలు, అడ్మిన్ బిల్లులు చెల్లించాలని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీనుకు హనుమకొండ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పేస్కేల్ ఇస్తామని గత ఏడాది హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. పేస్కేల్ అమలుతోపాటు పెండింగ్ వేతనాలు, అడ్మిన్ బిల్లులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో తమ కార్యాచరణ వెల్లడిస్తామని జేఏసీ నాయకులు వినతిపత్రంలో ప్రస్తావించారు.

కేయూ సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

హనుమకొండ చౌరస్తా, జనవరి 28: కేయూలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ రిజిస్ట్రార్ పీ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సూపరింటెండెంట్ పదోన్నతి పొందినవారిలో యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ బీసీఎం రాజు, యూనివర్సిటీ న్యాయకళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆర్.స్వరూపరాణి ఉన్నారు. వారికి వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్